క్లుప్తంగా

దేవదాయ భూములకు కౌలు వేలం


హనుమంతరావు

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ గ్రూప్ పరిధిలోని దేవస్థానాలకు సంబంధించిన సుమారు 170 ఎకరాల సాగుభూమి బహిరంగ కౌలువేలం నిర్వహిస్తున్నట్లు వినుకొండ నియోజకవర్గ దేవదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి కొల్లి హనుమంతరావు ఆదివారం తెలిపారు. పట్టణంలోని పాత శివాలయం వద్ద గల కోదండ రామస్వామి దేవాలయంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీవరకు బహిరంగ కౌలువేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. దేవదాయ అధికారుల సూచన మేరకు కౌలు వేలంలో పాల్గొనే వారు దరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9494999112 నంబరులో సంప్రదించాలన్నారు.

ముళ్ల కంచెలు తొలగింపు



శావల్యాపురం: కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సారథ్యంలో జాతీయ రహదారి మార్గంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు ఆర్అండ్బీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈసందర్భంగా వినుకొండ నుంచి నరసరావుపేట వరకు జాతీయ రహదారి మార్గంలో ఇరువైపుల ముళ్ల కంచెలు తొలిగింపు, చెట్లు కొమ్మలు తొలిగించి రోడ్డు మలుపుల సమీపంలో ప్రమాద సూచకబోర్డులు వాహనదారులకు కనిపించేలా పొక్లెయిన్ ద్వారా పనులు చేస్తున్నారు. రహదారి మార్గంలో ఇరువైపుల మూడు మీటర్ల మేర రోడ్డును చదును చేయటంతో పాటు అవసరమైన చోట మట్టితో నింపుతున్నారు. వర్షాకాలంలో జాతీయ రహదారి మార్గంలో వర్షపునీరు నిలిచిపోకుండా ఉండేలా, గుంతలు ఏర్పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అలాగే గుంతలు ఏర్పడిన ఏరియాతో పాటు రోడ్డు అంతా ప్యాచ్ వర్క్ పనులు ఆధునిక యంత్ర పరికరాల ద్వారా త్వరితిగతిన చేస్తున్నారు.

వేగంగా మల్లికార్జున స్వామి దేవస్థానం నిర్మాణ పనులు



యడ్లపాడు: మండలంలోని వంకాయలపాడు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పునఃనిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. సుమారు రెండు శతాబ్దాల నాటి ఈ ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు సమష్టిగా పునఃనిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే బేస్ మట్టం పనులు ముగిసి గర్భగుడి, అంతరాలయం, ఉపాలయ పనులు కొనసాగుతున్నాయి. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు ఇతోధికంగా విరాళాలు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కాదలచిన వారు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



చిలకలూరిపేటటౌన్: గొంతెండి పోయి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బొప్పూడి గ్రామ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారి బొప్పూడి ప్రసన్నాంజనేయస్వామి ఆలయం సమీపాన ఉన్న హెచ్పీ పెట్రోల్ బంకు వద్ద ఓ వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని హైవే పెట్రోలింగ్ పోలీసులు ఆదివారం గుర్తించారు. మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

యడ్లపాడు: తనపై దాడి చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలంటూ యడ్లపాడు పోలీస్ స్టేషన్‌లో చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన తులువ శివనాగేశ్వరరావు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెంఘీజ్‌ఖాన్‌పేట గ్రామానికి చెందిన ఇక్కుర్తి నిరీక్షణ్ మూడేళ్ల క్రితం మద్యం సేవించి ద్విచక్ర వాహనాన్ని ఇష్టానుసారంగా నడపడాన్ని గమనించిన తులువ శివనాగేశ్వరరావు అతని కుటుంబ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లాడు. దీనిని మనసులో ఉంచుకున్న నిరీక్షణ్ ఈ నెల 24వ తేదీన గ్రామంలోని గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న తనపై కర్రతో దాడి చేయగా తలకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు శివనాగేశ్వరరావును చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివనాగేశ్వరరావు యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

- సీఐ సుధాకరరావు
- పేరూరుపాడు, బొల్లాపల్లిలో జరిగిన అల్లర్లపై విచారణ
- శాంతిభద్రతలపై గ్రామస్తులకు అవగాహన


బొల్లాపల్లిలో అవగాహన కల్పిస్తున్న సీఐ సుధాకరరావు, ఎస్ఐ చెన్నకేశవులు


వేల్పూరులో కవాతు చేస్తున్న సీఐ సుధాకరరావు, ఎస్ఐ, సిబ్బంది

బొల్లాపల్లి: పోలింగ్ అనంతరం అల్లర్లకు పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేస్తామని వినుకొండ రూరల్ సీఐ యు.సుధాకరరావు తెలిపారు. బొల్లాపల్లి పోలీసుస్టేషన్‌లో పోలింగ్ అనంతరం జరిగిన గొడవల గురించి ఎస్ఐ డి.చెన్నకేశవులుతో కలిసి విచారించారు. మండలంలోని పేరూరుపాడు, బొల్లాపల్లిలో చోటుచేసుకున్న అల్లర్లపై విచారణ చేశారు. అనంతరం సీఐ అల్లర్లకు పాల్పడిన వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండల కేంద్రం బొల్లాపల్లి ప్రధాన కూడలిలో గ్రామస్తులకు శాంతి భద్రతల గురించి అవగాహన కల్పిస్తూ మాట్లాడుతూ ఇరు పార్టీలు సంయమనం పాటించాలని అన్నారు. నియోజకవర్గంలో బొల్లాపల్లికి మొదటి నుంచి ప్రశాంతమైన గ్రామంగా పేరుందని అన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలిపాలని, పోలీసులకు సహకరించాలని సూచించారు. గెలుపోటములు సహజమని, కేసులు నమోదైతే ఎవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ఓట్ల లెక్కింపు రోజున గ్రామాల్లో గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఎస్ఐ డి.చెన్న కేశవులు మాట్లాడుతూ ఎన్నికల అనంతరం అల్లరి మూకలపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. పార్టీల కతీతంగా చర్యలు తప్పవని అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.


ఇర్లపాడులో చర్చి వద్ద గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి

వేల్పూరు, పోట్లూరులో పోలీసు కవాతు...

శావల్యాపురం: సార్వత్రిక ఎన్నికల అనంతరం గ్రామాల్లో గొడవులు, అల్లర్లుకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకరరావు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని వేల్పూరు, పోట్లూరు గ్రామాల్లో కేంద్ర బలగాల సారధ్యంలో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ సుధాకరరావు మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు అనంతరం గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఉండటానికి గ్రామాల్లో సోదాలతో పాటు కేంద్ర బలగాలచే ప్రత్యేకంగా కవాతు నిర్వహిస్తున్నామన్నారు. యువత ఇటువంటి రాజకీయ ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల సమయంలో కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఆయా గ్రామాల్లోని ప్రధాన కూడలి మార్గాల్లో ఎన్నికల నిబంధనలు, ఓట్ల లెక్కింపు అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలను సీఐ వివరించారు. ఎస్ఐలు చల్లా సురేష్ లక్ష్మీనారాయణరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో ...

చిలకలూరిపేటటౌన్: మండలంలోని మూడు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసులు అవగాహన సమావేశాలు ఏర్పాటు చేశారు. కట్టుబడివారిపాలెం, యడవల్లి, కమ్మవారిపాలెం గ్రామాల్లో రూరల్ సీఐ పి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు కౌంటింగ్ రోజున ఎలాంటి ఉత్సవాలు చేయడం, బాణసంచా కాల్చడం నిషేధం అన్నారు. గెలుపోటముల వివరాలు తెలిశాక హడావిడి చేయకూడదన్నారు. బైకులపై చక్కర్లు కొట్టడం వంటివి చేయరాదన్నారు. అలా చేసిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు. ఎస్ఐ జి.రవికృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో కార్డన్ సెర్చ్

నాదెండ్ల: రాజకీయ ప్రేరేపిత ఘర్షణల్లో ఇరుక్కుని జీవితాలను పాడు చేసుకోవద్దని చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి చెప్పారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు, కనపర్రు గ్రామాల్లో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి, టౌన్, రూరల్ ఎస్ఐలు జి.రవికృష్ణ, బాలకృష్ణ, యడ్లపాడు ఎస్ఐ రాజీవ్, సిబ్బంది గ్రామంలో అనుమానాస్పద ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ, జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ప్రజలు ఉద్రేకాలకు లోనై అల్లర్లు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంతంగా ఉండాలన్నారు. గ్రామంలో హింసను రెచ్చగొట్టేవారిని ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



రొంపిచర్ల: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రొంపిచర్ల శాఖ గ్రంథాలయ అధికారి సుబ్బారావు అన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో గ్రంథాలయానికి వచ్చి చదువుకోవటం అలవాటు చేసుకోవటమే ఈ శిబిరం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ శిబిరాల్లో రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. పుస్తక పఠనంలో సమస్యలను అక్కడికక్కడే నివృత్తి చేస్తారన్నారు. కథలు వినడం, పుస్తక సమీక్ష, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర అంశాలపై విద్యార్థులకు తెలియజేయనున్నట్లు తెలిపారు. ఈ విజ్ఞాన శిబిరాలు జూన్ 7వ తేదీ వరకు నిర్వహిస్తామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ మండలంలోని విఠంరాజుపల్లి గ్రామం వద్ద గల సాయి బృందావనంలో శాంతి ఆశ్రమ ట్రస్ట్ సభ్యులు కన్నెగండ్ల అనంత కోటేశ్వరరావు, గర్రె శివారూపేష్ దంపతులు పేద విద్యార్థినికి ఆర్థికసాయం ప్రకటించారు. చీకటీగలపాలెం మోడల్ స్కూల్ 10వ తరగతిలో ఫస్ట్‌క్లాస్‌లో పాసైన తడికమల్ల పూజితకు ఇంటర్మీడియట్‌లో చేరేందుకు రూ.10వేలు అఖండ జ్యోతి ప్రదాత శ్రీ హిమాలయ గురూజీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పెండేల వెంకటమోహన్‌రావు, పుల్లారావు, కొప్పురావూరి సుధాకర్, సురేష్, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటుపై అన్నదాతల హర్షం

- చురుగ్గా చిలకలూరిపేట బైపాస్ నిర్మాణ పనులు
- గణపవరం వద్ద క్యాటిల్ అండర్‌పాస్ నిర్మాణ పనులు ప్రారంభం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు


గణపవరంలో అప్పాపురం డొంక వద్ద చురుగ్గా జరుగుతున్న క్యాటిల్ అండర్‌పాస్ నిర్మాణ పనులు

నాదెండ్ల: తాతపూడి-తిమ్మాపురం వరకూ జాతీయరహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో గణపవరం వద్ద అప్పాపురం వెళ్లే డొంకరోడ్డులో ప్రభుత్వం శరవేగంగా క్యాటిల్ అండర్‌పాస్ ఏర్పాటు నిర్మిస్తుండంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాతపూడి-తిమ్మాపురం వరకూ 16 కిలోమీటర్ల పరిధిలో బైపాస్ పనులు సుమారు రూ.900 కోట్ల నిధులతో జరుగుతున్నాయి. అయితే గణపవరం వద్ద క్యాటిల్ అండర్‌పాస్ కావాలంటూ గ్రామానికి చెందిన రైతులు 2022 జనవరిలో నేషనల్ హైవే అథారిటీ వారికి, మంత్రి విడదల రజినికి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు. అప్పట్లో జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్‌లు సహా బైపాస్ నిర్మాణ పనులను పరిశీలించి రైతులతో మాట్లాడి, సమస్యను తెలుసుకున్నారు.

చురుగ్గా నిర్మాణ పనులు..

బైపాస్‌కు అవతలి వైపున గ్రామానికి చెందిన సుమారు 400 మంది రైతులకు సుమారు వెయ్యి ఎకరాల పంట భూమి ఉంది. వ్యవసాయ పనుల నిమిత్తం రాకపోకలు సాగించేందుకు క్యాటిల్ అండర్‌పాస్ కావాలంటూ అధికారులకు సమస్యను వివరించారు. క్యాటిల్ అండర్‌పాస్ లేకుంటే మూడు కిలోమీటర్లు దూరం చుట్టూరా తిరిగి రావాల్సి వచ్చేదని, ఇది కష్టతరమే కాక రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయని రైతులు వివరించారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లా రాజమోహనరావు రైతులతో కలిసి ఆందోళనల్లో పాల్గొన్నారు. మంత్రి విడదల రజిని విజ్ఞప్తి మేరకు అప్పటి జిల్లా కలెక్టర్ క్యాటిల్ అండర్‌పాస్ నిర్మాణానికి ప్రభుత్వ అనుమతితో కొంత నిధిని ఏర్పాటు చేశారు. దీంతో గత వారం రోజులుగా అప్పాపురం వెళ్లే డొంక రోడ్డులో క్యాటిల్ అండర్‌పాస్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రైతులకు ఎంతో మేలు..



బైపాస్ నిర్మాణ పనులు సాగుతున్న నేపథ్యంలో గణపవరం వద్ద అప్పాపురం వెళ్లే డొంక రోడ్డుకు క్యాటిల్ అండర్‌పాస్ కావాలంటూ 2022 జనవరిలో నేషనల్ హైవే అథారిటీ అధికారులు, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులకు లిఖితపూర్వకంగా తెలియజేశాం. ఎట్టకేలకు అధికారులు క్యాటిల్ అండర్‌పాస్‌ను ఏర్పాటు చేయటం హర్షణీయం. దీంతో గ్రామ రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– కెల్లంపల్లి సుందరరావు, మాజీ సర్పంచ్

ఎంతో సంతోషంగా ఉంది ...



గణపవరం గ్రామానికి చెందిన రైతులకు బైపాస్‌కు ఇరువైపులా వందల ఎకరాల పంట భూమి ఉంది. అప్పాపురం డొంక రోడ్డు ద్వారా పొలాలకు రాకపోకలు సాగించటం జరుగుతుంది. డొంక రోడ్డు గుండా వ్యవసాయ పనులు కొనసాగించాలంటే క్యాటిల్ అండర్‌పాస్ కావాలంటూ పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించాం. జిల్లా కలెక్టర్‌ను సంప్రదించి సమస్యను వివరించాం. ఎట్టకేలకు అధికారులు సానుకూలంగా స్పందించటం సంతోషం. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

– వలేటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్

సాగు పనులకు తప్పిన ఆటంకం



అప్పాపురం డొంక రోడ్డు గుండా వ్యవసాయ పనులు కొనసాగించాలంటే తప్పనిసరిగా క్యాటిల్ అండర్‌పాస్ కావాల్సిందే. అధికారులు, ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నిధులు మంజూరు చేసి నిర్మాణ పనులు జరుగుతుండటం సంతోషకరం. అండర్‌పాస్ ద్వారా ఎలాంటి ఆటంకం లేకుండా రాకపోకలు సాఫీగా సాగుతాయి. లేకుంటే సుమారు మూడు కిలోమీటర్లు చుట్టూ తిరిగి పొలాలకు చేరాల్సి వచ్చేది. ఆ సమయంలో రోడ్డు ప్రమాదాలకు గురికావాల్సి వచ్చేది.

– జంపని సురేష్, రైతు

కార్మికులు యాప్రాన్ ధరించాలి

మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి


నూతన యాప్రాన్‌లను ఆవిష్కరిస్తున్న కమిషనర్, అధికారులు

నరసరావుపేటః ప్రతి మున్సిపల్ కార్మికుడు పని చేసే సమయంలో తప్పకుండా యాప్రాన్ ధరించాలని కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కార్యాలయంలో కార్మికులకు నూతనంగా అందజేసే యాప్రాన్‌లను ఆవిష్కరించారు.. ఈసందర్భంగా మాట్లాడుతూ యాప్రాన్ ధరించటం వలన వార్డు ప్రజలు గుర్తించి ఇళ్లల్లోని చెత్తను అందజేస్తారన్నారు. లేనిపక్షంలో వారు కార్మికులను గుర్తించకుండా రోడ్లపై పడేస్తారని గుర్తు చేశారు. దీని వలన ప్రజలకు వారి బాధ్యత కూడా గుర్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ రామకోటయ్య, అసిస్టెంట్ ఇంజనీరు నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు


ఉపకార వేతనాలు అందుకున్న విద్యార్థులతో ఒయాసిస్ సంస్థ సభ్యులు

చిలకలూరిపేట: ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ చెప్పారు. పట్టణంలోని కేజే ఆసుపత్రి ప్రాంగణంలో ఒయాసిస్ సంస్థ ఆధ్వర్యంలో పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 22 మందికి రూ. 1,30,000 ఆర్థిక సహాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువశాతం పేద విద్యార్థులే విద్యాభ్యాసం చేస్తున్న నేపథ్యంలో అలాంటి విద్యార్థులను గుర్తించి ప్రతి ఏటా ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమ సంస్థ సభ్యులు అందజేసిన ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని పై చదువులు కొనసాగించాలని కోరారు. దాతలు అల్లం కృష్ణవేణి, టి.అనురాధ, ఎండీ కరిమా, పి.రాధా, పి.కీర్తి, జి.లక్ష్మి, డాక్టర్ ప్రఫుల్లాదేవి, డాక్టర్ వై.మధులత, కోలా విజయలక్ష్మి, కరణం విజయలక్ష్మి, చెరుకుపల్లి నిర్మల, కందిమళ్ల నారాయణ మూర్తి తదితరులు ఉన్నారు.

ముగిసిన కరాటే శిక్షణ తరగతులు


కరాటే విన్యాసాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

యడ్లపాడు: నేటి సమాజంలో ఆత్మరక్షణ విద్య అందరికీ అవసరమని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ చెరుకూరు సృజన తెలిపారు. యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి ఉచిత శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 20 రోజుల పాటు ప్రతిరోజు సాయంత్రం గంటన్నర పాటు కరాటేలో విద్యార్థులకు తర్ఫీదు ఇవ్వడం జరిగింది. ముఖ్యంగా బాలికలకు ఆత్మ రక్షణ కోసం యుద్ధకళ తప్పనిసరి అన్నారు. ఇదే వేదికపై కరాటే శిక్షణ పొందిన విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. కరాటే శిక్షకుడు రామకృష్ణ మాట్లాడుతూ శిక్షణ పొందిన విద్యార్థులు త్వరలోనే చిలకలూరిపేటలో జరిగే కరాటే పోటీల్లో పాల్గొనడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందినవారందరికీ సర్టిఫికెట్లు ఇస్తారన్నారు. ఈ సందర్భంగా యడ్లపాడు గ్రామ అభివృద్ధి కమిటీ తరపున రామకృష్ణను ఘనంగా సత్కరించారు.పోపూరి వెంకటేశ్వర్లు(చిన్న), అభివృద్ధి కమిటీ సభ్యులు కేతా రాంబ్రహ్మం, ఆరే వంశీ, పీఆర్ విజ్ఞాన కేంద్రం సభ్యులు నూతలపాటి కాశిదాసు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

రాజుపాలెం: మండలంలో పలు రైతు భరోసా కేంద్రాలలో సోమవారం నుంచి పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు సబ్సిడీపై పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయాధికారి వెంకటనరసయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలగ, జనుము, పిల్లిపెసర విత్తనాలను ఇస్తున్నట్లు తెలిపారు. జనుము, జీలగ కేజీ రైతులకు సబ్సిడీపై రూ.44కే ఇస్తున్నామని, పిల్లి పెసర కిలో సబ్సిడీపై రూ.67లకు అందజేయనున్నట్లు తెలిపారు. ఎకరానికి జనుము, జీలగ 10 కిలోలు, పిల్లి పెసర 8 కిలోలు ఇవనున్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్ కార్డు, పాస్ పుస్తకం తీసుకుని రైతు భరోసా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు. మిగిలిన నాలుగు గ్రామాలైన గణపవరం, బలిజేపల్లి, చౌటపాపాయపాలెం, అనుపాలెంలో గల రైతు భరోసా కేంద్రాలలో మంగళవారం నుంచి పచ్చిరొట్ట విత్తనాలు ఇస్తామని తెలిపారు.

కౌంటింగ్ రోజు పటిష్ట భద్రత


మాట్లాడుతున్న సీఐ మంగారావు, పక్కన అమరావతి సీఐ బ్రహ్మం, సిబ్బంది

క్రోసూరు: ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మండలంలో పోలీసులు ముమ్మర తనిఖీలు, భద్రతా చర్యలు చేపట్టారు. జూన్ నెల 4న ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రజలు పూర్తిగా సహకరించాలని సీఐ మంగారావు ఆదివారం కోరారు. స్థానిక నాలుగు రోడ్ల సెంటర్ నుంచి గ్రామ శివారు వరకు పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి, క్రోసూరు, అచ్చంపేట మండలాల సీఐలు, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించారు. అమరావతి బస్టాండు సెంటర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో సీఐ మంగారావు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జూన్ 3, 4 తేదీల్లో అన్ని వ్యాపార సంస్థలు, దుకాణాలు మూసివేయాలని చేయాలని, నలుగురు కలిసి తిరగరాదని చెప్పారు. అల్లర్లకు పురిగొల్పడం, బాణ సంచా కాల్చడం, సంబరాలు నిర్వహించటం నిషిద్ధమని స్పష్టం చేశారు. ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు.

ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యం

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా పెట్టుకున్నామని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.రాంబాబు అన్నారు. ఎన్నికలకు సంబంధించిన పలు విషయాలను ఆదివారం ఆయన వెల్లడించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం ముప్పాళ్ళ మండలం మాదల గ్రామంలో పెట్రోల్ బాంబులు లభించిన నేపథ్యంలో ఇప్పటికే ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 500 మందిని ఎన్నికలకు ముందు బైండోవర్ చేశామని, బైండోవర్ చేసిన వారిలో 46 మంది ఎన్నికల అల్లర్లలో మళ్లీ భాగస్వాములు అయినట్లు గుర్తించామన్నారు. వారిలో 35 మందిని ముప్పాళ్ళ తహసీల్దారు సమక్షంలో బాండ్ అమౌంటు ప్రభుత్వానికి చెల్లించాల్సిందిగా నోటీసులు ఇచ్చామన్నారు. వీరిలో 16 మంది మాత్రమే హాజర య్యారన్నారు. సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 30 మందిపై రౌడీ షీట్లు ఓపెన్ చేశామన్నారు. నకరికల్లు మండలం గుండ్లపల్లి గ్రామంలో ఈవీఎం ధ్వంసం చేసిన కేసులో ఇప్పటి వరకు 25 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇంకా కొంతమంది తప్పించుకు తిరుగుతున్నారని, వారిని కూడా త్వరలో అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని సమస్యా త్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్డన్ సెర్చ్ లో భాగంగా ఎటువంటి ఆధారాలు లేని వాహనాలను గుర్తిస్తే వాటిని సీజ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే ఎంతటివారినైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

విద్య ద్వారానే సమాజంలో గౌరవం



సత్తెనపల్లి: విద్య ద్వారానే సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని కార్డ్ సంస్థ పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ టి.అమర్నాథ్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన బాలబాట డెవలప్మెంట్ ఆర్గనైజర్ల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఈ సమావేశానికి పల్నాడు జిల్లా డిప్యూటీ డైరెక్టర్ జి.సుబ్బారావు అధ్యక్షత వహించారు. అమర్నాథ్ మాట్లాడుతూ విద్యతో అభివృద్ధి సాధించవచ్చునన్నారు. సత్తెనపల్లి ఏరియా కో-ఆర్డినేటర్ జి.రవి మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో విద్యనభ్యశించి ఉన్నతమైన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బాలబాట డెవలప్మెంట్ ఆర్గనైజర్లకు రెండు నెలల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 30 మంది డెవలప్మెంట్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.